సాక్షి
సూర్యాపేట
సోమవారం । 1 । జనవరి । 2024

నయా జోష్



సూర్యాపేటలో కేక్ కట్ చేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు



తాళ్లగడ్డలో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతున్న యువకులు

మంత్రి కోమటిరెడ్డి న్యూ ఇయర్ శుభాకాంక్షలు



నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలనపోయి తెలంగాణ ప్రజలకు ప్రజాపాలన వచ్చిందన్నారు. ప్రజలకు మంచి రోజులు వచ్చాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో మరిన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతామన్నారు. ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

శుభాకాంక్షలు చెప్పేందుకు హైదరాబాద్ రావొద్దు

నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు తన వద్దకు హైదరాబాద్ రావద్దని మంత్రి పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త.. గ్రామాల్లో, వార్డుల్లో ఉండి వృద్ధులు, నిరక్షరాస్యులు, అభాగ్యులకు అండగా ఉండాలని సూచించారు. వచ్చే వారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చి ప్రతీ ఒక్కరిని కలుస్తానని తెలిపారు. తనకు ఇచ్చేందుకు బొకేలు, శాలువాలు కొనవద్దని.. అదే డబ్బును సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమచేయాలని కోరారు.

అందరికీ శుభం కలగాలి : ఎస్పీ

సూర్యాపేట క్రైం: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలని కోరుకుంటున్నానని ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, యువకులు మద్యం సేవించి విచ్చలవిడిగా రోడ్లపై సంచరించవద్దని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్‌తో చేయొద్దని కోరారు.



ఎస్పీ రాహుల్ హెగ్డే

కొత్త ఆశయాలతో..

- 2024కు స్వాగతం పలికిన జిల్లా ప్రజలు
- నూతన ఒరవడితో ముందుకు సాగుతామంటున్న ఉన్నతాధికారులు

కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలతో జిల్లావాసులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పాత ఏడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త లక్ష్యాలతో కొత్త వసంతంలోకి అడుగుపెట్టారు. డిసెంబర్ 31 రాత్రి 12 గంటలకు 2023కు వీడ్కోలు.. 2024కు స్వాగతం చెబుతూ ఆనంద డోలికల్లో తేలిపోయారు. అధికారులు సైతం వేడుకల్లో పాల్గొన్నారు. గత ఏడాది చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ఈ సంవత్సరం తమ లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. – దురాజ్‌పల్లి(సూర్యాపేట), నల్లగొండ, సాక్షి, యాదాద్రి

జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకెళ్తాం



జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నాం. కొత్త ప్రభుత్వం కూడా అధికారులకు సహకరిస్తోంది. ఉద్యోగుల అటెండెన్స్, సెలవులు మానిటరింగ్ చేసేందుకు త్వరలోనే కొత్త యాప్‌ను పరిచయం చేయబోతున్నాం. ఈ యాప్‌ను రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిచే ప్రారంభింపజేస్తాం. మొదటి దశలో జిల్లాలోని అన్ని ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో పాటు జిల్లా అధికారుల కార్యాలయాల్లో అమలు చేస్తాం. ఆ తర్వాత గ్రామీణ స్థాయికి పరిచయం చేస్తాం. ప్రభుత్వం అమలు చేస్తున్న అభయ హస్తంలో ఆరు గ్యారంటీలను ప్రజలకు చేరవేయడమే మా ప్రధాన లక్ష్యం. జిల్లాలో అమలు చేసే ప్రతి ప్రభుత్వ పథకాన్ని అర్హులకు లబ్ధి చేకూరుస్తాం. కొత్త సంవత్సరంలో జిల్లా సమగ్రాభివృద్ధికి యంత్రాంగమంతా మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– ఎస్.వెంకట్రావు, కలెక్టర్, సూర్యాపేట

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



జిల్లాలో అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తాం. స్త్రీ శిశు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలను చేపట్టి గర్భిణులు, పిల్లలకు పోషకాహారాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలు, గ్రామాల అభివృద్ధికి పాటు పడడంతోపాటు అన్నిచోట్ల పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తాం. కొత్త ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పథకాన్ని పక్కాగా అమలు చేసి తీరుతాం.

– సీహెచ్.ప్రియాంక, అదనపు కలెక్టర్, సూర్యాపేట

పథకాలు అమలు చేయడమే లక్ష్యం



ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలో మారుమూల గ్రామ ప్రజలకు సైతం అందించే లక్ష్యంగా కొత్త సంవత్సరంలో అడుగులు వేస్తాం. జిల్లా అభివృద్ధికి అధికార యంత్రాంగం పాటు పడాలి. రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాం. జిల్లా అభివృద్ధికి ప్రజలు కూడా సహకారం అందించాలి.

– వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్, సూర్యాపేట

ఆరు గ్యారంటీలను అందిస్తాం



ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి అర్హులైన పేదలకు అందజేసేందుకు కృషి చేస్తా. ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తోంది. ఆ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రతి పథకాన్ని అర్హులకు చేరవేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తా.

– జె.శ్రీనివాస్, అదనపు కలెక్టర్, నల్లగొండ

విధి నిర్వహణకే ప్రాధాన్యం



విధి నిర్వహణకే అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేడమే లక్ష్యం. రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నేను.. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాం. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, పోలీసు శాఖ, మీడియా, రాజకీయ పార్టీలు సహకరించాయి. 2024 సంవత్సరంలో లోక్‌సభ, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను కూడా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు నావంతు ప్రయత్నం చేస్తాను. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం నా ప్రధాన కర్తవ్యం.
- కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు.

– హన్మంత్ కె.జెండగే, కలెక్టర్, యాదాద్రి

ప్రజలకు మరింత చేరువవుతాం



గడిచిన ఏడాది ఎన్నో సవాళ్లను అధిగమించాం. అనేక విజయాలు సాధించాం. న్యూ ఇయర్‌లో ఇంకా బాధ్యతగా పనిచేసి ప్రజలకు చేరువ కావాలన్నదే మా లక్ష్యం. నేరస్తులకు శిక్షలు పడి నేరప్రవృత్తికి దూరం అయ్యేలా కృషి చేస్తాం.

- ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదు దారులకు ఫలితం కనిపించే విధంగా నూతన సంవత్సరంలో జిల్లా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దుతాం. పోలీసు లంటే ప్రజల్లో భయం పోగొట్టి స్వేచ్ఛగా తమతో మమేకం అయ్యేలా చేస్తాం. లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ప్రశాంతమైన వాతావరణంలో, పారదర్శకంగా పూర్తి చేయాలన్నది పోలీసు శాఖ లక్ష్యం. కానిస్టేబుల్ నుంచి డీసీపీ వరకు జవాబుదారీ తనంతో నడుచుకునేలా కృషి చేస్తాం.
- 2023 సంవత్సరంలో విజయవంతంగా పనిచేశాం. జనవరిలో జిల్లాకు వచ్చాను.ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం. గత ఏడాదితో పోలిస్తే నేరస్తులకు శిక్షలు అధికంగా పడే విధంగా చర్యలు తీసుకున్నాం. కానిస్టేబుల్ నుంచి డీసీపీ స్థాయి అధికారి వరకు విధి నిర్వహణలో పక్కాగా పని చేస్తున్నారు. నేరం చేసినవారు తప్పించుకోకుండా పక్కాగా నేర పరిశోధనకు ప్రయత్నిస్తాం.
- కొత్త సంవత్సరంలో యువత నూతన లక్ష్యాలతో ముందుకు సాగాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు. చెడు మార్గాల్లో పయనించి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. ప్రజలకు, పోలీసులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు.


– రాజేశ్‌చంద్ర, డీసీపీ, భువనగిరి

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అర్హులైన వారు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం ఫిబ్రవరి 24నుంచి మార్చి 14వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 4న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తయి మూడేండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నల్లగొండ ఎస్పీగా చందనా దీప్తి

- ప్రస్తుత ఎస్పీ అపూర్వరావు బదిలీ



చందనా దీప్తి

నల్లగొండ క్రైం : జిల్లా ఎస్పీ అపూర్వరావు బదిలీ అయ్యారు. ఆమెను ప్రభుత్వం సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ ఎస్పీగా బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అపూర్వరావు 2023, జనవరి 26న నల్లగొండలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న చందనాదీప్తిని ప్రభుత్వం నియమించింది. 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తి ట్రెయినీ ఐపీఎస్‌గా నల్లగొండ జిల్లాలో విధులు నిర్వహించారు.

మరో మూడు కొత్త లిఫ్టులకు ప్రతిపాదనలు

- ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు



శివగంగ ఎత్తిపోతలను పరిశీలిస్తున్న సీఈ

హుజూర్‌నగర్: చింతలపాలెం, పాలకవీడు మండలాల్లో మరో మూడు కొత్త లిఫ్టులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఓలేటి వెంకట రమేష్‌బాబు తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం చింతలపాలెం మండం వెల్లటూరు వద్ద శివగంగ ఎత్తిపోతలతో పాటు నూతనంగా దొండపాడు–2, తమ్మారం వద్ద ఎత్తిపోతల పథకాల సాధ్యాసాధ్యాలను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన దొండపాడులో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని లిఫ్టుల పనితీరుపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారని చెప్పారు. దీంట్లో భాగంగా తొలుత కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని లిఫ్టులను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎత్తిపోతల పథకాలను త్వరలో పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం పాక్షికగా వినియోగంలో ఉన్న లిఫ్టులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి వ్యయ అంచనాలను తయారు చేసి మంత్రికి అందిస్తామని వెల్లడించారు. రూ.41 కోట్లతో చింతలపాలెం మండలం నక్కగూడెం లిఫ్టు పునరుద్ధరణతోపాటు తమ్మారం, దొండపాడు–2, పాలకవీడు మండల బెట్టతండాలో కొత్త లిఫ్టుల ప్రతిపాదన ఉన్నదని, వాటి అంచనాలను కూడా పరిశీలిస్తామన్నారు. మేళ్లచెరువు మండలం రామాపురంలోని గోపాల్‌రావు చెరువును కృష్ణాజలాలతో నింపి రైతులకు సాగునీరందించే ప్రతిపాదనను కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ నర్సింహారావు, ఈఈలు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరు



నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సూర్యాపేట టౌన్: రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) నిరంతరం పోరాడుతోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు అన్నారు. ఆదివారం సూర్యాపేటలో ఆ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వం పరిశీలించి వెంటనే ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సబ్జెక్టు టీచర్ల కొరతను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, జె.యాకయ్య, కె.అరుణభారతి, వెంకటయ్య, దామోదర్, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, బి.ఆడం, రమేష్, సోమయ్య, డి.శ్రీనివాస్, ఎం.రవీందర్, రమేష్, ఉదయభాస్కర్, గౌస్, సోమయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.















యాదాద్రి క్షేత్రంలో భక్తజన సందోహం



ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



యాదాద్రి కొండపై భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజుతో పాటు 2023 సంవత్సరానికి చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, పుష్కరిణి వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. భక్తులు అధికంగా రావడంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారి ఆలయానికి రూ.42,00,353 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అయ్యప్పను దర్శించుకున్న ట్రాన్స్‌జెండర్

- కేరళ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జోగిని నిషా క్రాంతి



కేరళలోని అయ్యప్ప సన్నిధానంలో జోగిని నిషా క్రాంతి

నార్కట్‌పల్లి : కేరళ చరిత్రలో ఓ ట్రాన్స్ జెండర్ తొలిసారి శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు, ప్రతి అమావాస్యకు విచ్చేసే ట్రాన్స్‌జెండర్ జోగిని నిషా క్రాంతి ఆదివారం శబరిమల అయ్యప్ప ఆలయంలో స్వామివారిని దర్శించుకుంది. ట్రాన్స్ జెండర్ ఐడీ ఆధారంగా ఆమెకు కేరళ ప్రభుత్వం దర్శనానికి అనుమతిచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ జండర్‌లు చాలా మంది అయప్ప మాల ధరించి స్వామిని దర్శించుకోవాలని అనుకుంటున్నారని చెప్పింది. తనకు దర్శనం కల్పించిన కేరళ ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపింది. ఇది ఒక శుభ పరిణామమని.. తాను కూడా అందరిలాగే శబరిమల కొండ ఎక్కి అయ్యప్పను దర్శించుకోవడంతో తన జన్మ ధన్యం అయిందని పేర్కొంది.





సూర్యక్షేత్రంలో వైభవంగా పూజలు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్ల వారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞ శాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అక్షర స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఆది వారం సూర్యక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర విశిష్టతను క్షేత్ర నిర్వాహకులు వారికి తెలియజేశారు.



























సాక్షి క్లాసిఫైడ్స్

Services

వధువు కావలెను

- అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35Y. M.Sc., M.Ed. జా॥, డిగ్రీ కాలేజీ ప్రైవేట్ లెక్చరర్, 20 వేలు, ఆస్థి 30 లక్షలు, నల్లగొండ. సంప్ర॥ 9121325068 [Y-798305]

Real Estate

PLOT FOR SALE

- **800 Sq yds (120X60)** East Facing 30 Feet Road సూర్యనగర్ కాలనీ, నల్లగొండ నందు అమ్మకమునకు కలదు. సంప్ర॥ సెల్: 6303025110, 9888808442 [Y-798403]

FOR SALE

- **నల్లగొండ - కేశరాజుపల్లి** MLG బైపాస్ రోడ్డులో మడిగ షట్టర్ ప్లాట్లు అమ్మబడును. సంప్రదించగలరు. 8555085595 [Y-798402]

PLOT FOR SALE

- **మహాత్మాగాంధీ యూనివర్సిటీ** ప్రక్కన గల వశిష్ఠ వెంచర్ నందు DTCP అప్రూవల్ కలిగిన ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ : 9885650635, 6281714883 [Y-798404]

VILLA FOR SALE

- **Ready to Occupy Duplex Luxury** 3BHK -2340 SFT Villas in the Best Gated Community at Miryalaguda, Next to New DMart. Club House Swimmingpool, Fully Operational Must See Call: 7013578378 [H-788046]

Wanted

- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167578]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k. సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.